సమ్మక్క జాతర
హుండీ ఆదాయం రూ.29 లక్షలు 6లో..

6లో.. పేరుకే జనరల్ ఆసుపత్రి..
దిక్కులేని కార్డియో విభాగం


సుగ్లాంపల్లి సమీపంలో జరుగుతున్న పైప్‌లైన్ పనులు

శరవేగంగా ఇంటింటికీ వంటగ్యాస్ పనులు

- ఉమ్మడి జిల్లాకు సరఫరా
- మొదట సీఎన్జీ గ్యాస్ స్టేషన్లకు
- ఆ తర్వాత ఇంటింటికీ సరఫరా

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా కేంద్రప్రభుత్వం వంట గ్యాస్ సరఫరా చేసేందుకు జరుగుతున్న పైప్‌లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మధ్యమధ్యలో గ్యాపులను వదిలి పెద్దపల్లి జిల్లా గర్రెపల్లి వరకు పైపులు వేశారు. జాయింట్లను గ్యాస్ వెల్డింగుతో అతుక బెట్టి కందకాలు తవ్వి అందులో అమరుస్తున్నారు. ఢిల్లీ, ముంబాయ్, అహ్మదాబాద్ మాదిరిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇంటింటికీ వంటగ్యాస్ సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్యాస్ సరఫరా చేసే బాధ్యతను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు కేంద్రం అప్పగించింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో పైప్‌లైన్ ద్వారా ఇటు వ్యాపార సంస్థలు, చిన్న తరహా పరిశ్రమలు, గృహాలకు గ్యాస్ సరఫరా చేయనున్నారు. పెట్రోల్ బంక్‌ల్లో సీఎన్జీ అందుబాటులోకి తీసుకు రానున్నారు. రామగుండంలో నిర్మించిన గ్యాస్ ఆధారిత ఎరువుల తయారీ కేంద్రానికి తూర్పు గోదావరి నుంచి గ్యాస్ సరఫరా చేసేందుకు పైప్‌లైన్ వేశారు. ఆ పైప్ లైన్ నుంచే ఇంటింటికి వంట గ్యాస్ ఇవ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో గ్యాస్ స్టేషన్ నిర్మాణం కూడా పూర్తయ్యింది. మొదట రామగుండం కార్పొరేషన్‌లో దీనిని అమల్లోకి తీసుకురానున్నారు. ఇందుకోసం పైప్‌లైన్ల నిర్మాణం కూడా పూర్తయ్యింది. కనెక్షన్ ఇవ్వడమే ఆలస్యం. కనెక్షన్లు ఇచ్చిన వెంటనే గ్యాస్ సరఫరా చేయనున్నారు. దేశ వ్యాప్తంగా పైప్‌లైన్ల ద్వారా ఇంటింటికి వంట గ్యాస్ సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డుకు పనులు అప్పగించింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. 13 జిల్లాలు మెగా ఇంజనీరింగ్ కంపెనీకి, ఉమ్మడి కరీంనగర్ ఐవోసీకి, ఉమ్మడి ఆదిలాబాద్ మహానగర్ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలు టోరెంటో గ్యాస్ సంస్థలకు అప్పగించారు. ఈ సంస్థలు కేజీ బేసిన్ నుంచి సరఫరా అయ్యే గ్యాస్‌ను తీసుకుని ఆయా జిల్లాల్లోని గృహ అవసరాలకు పైప్‌లైన్ ద్వారా సరఫరా చేయనున్నారు. మీటర్లు బిగించి వాడిన గ్యాస్‌ను బట్టి బిల్లులు వసూలు చేస్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నివాసాలకు ప్రైవేట్ నేచురల్ గ్యాస్ సరఫరా చేస్తారు. వీటితో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు డిమాండ్‌ను బట్టి సరఫరా చేయనున్నారు. మొదటి దశలో రామగుండం, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల వంటి పట్టణ ప్రాంతాలకు సరఫరా చేస్తారు. వీటితో పాటు బొగ్గు ఆధారితంగా నడిచే చిన్నచిన్న పరిశ్రమలకు ప్రత్యామ్నాయంగా గ్యాస్ సరఫరా చేస్తారు. ముఖ్యంగా ఇండస్ట్రియల్ ఏరియాలోని ప్లాస్టిక్, ఆటో మొబైల్ పరిశ్రమలకు కనెక్షన్లు ఇస్తారు. కేంద్ర ప్రభుత్వం సీఎన్‌జీ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడంతో జిల్లాలోని ప్రధాన మార్గాల్లో సీఎన్‌జీ స్టేషన్లను నెలకొల్పనున్నారు. ఇప్పటికే కరీంనగర్‌లో ఐవోసీ ఆధ్వర్యంలో ఒక సీఎన్జీ స్టేషన్‌ను నెలకొల్పారు. రామగుండంలో రెండు స్టేషన్లు నెలకొల్పనున్నారు. కరీంనగర్ వరకు పైప్‌లైన్ నిర్మాణ పనులు మరో నాలుగునెలల్లో పూర్తి కానున్నాయి.

40 శాతం ధర తక్కువ..

ఎల్పీజీతో పోల్చితే పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే గ్యాస్ ధరలు 40 శాతం తక్కువగా ఉండనున్నాయి. గాలి కన్నా బరువు తక్కువగా ఉండడంతో రక్షణ కూడా ఉంటుంది. గ్యాస్ లీకేజీలు, అగ్నిప్రమాదాలకు అవకాశం ఉండదు. ఒకవేళ గ్యాస్ లీకైనా సాధారణంగా గాలిలో కలిసి పోతుంది. ఇళ్లల్లో మీటర్ల రీడింగ్ ఆధారంగా బిల్లులు వేయనున్నారు. ఇప్పటికే ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌కు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయాలని నిర్ణయించారు. ఎన్టీపీసీ, సింగరేణి యాజమాన్యాలతో ఐవోసీ చర్చలు జరుపుతున్నది. జిల్లాలో సింగరేణి, ఎన్టీపీసీలకు యాజమాన్యం నిర్వహణలో టౌన్‌షిప్‌లు ఉన్నాయి. రామగుండంలో 16 వేలకుపైగా సింగరేణి క్వార్టర్లు ఉన్నాయి. సింగరేణి సంస్థనే కార్మిక కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తోంది. వేతనాల్లో బిల్లులను కలిపి చెల్లిస్తోంది. సింగరేణి కార్మిక కుటుంబాలకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసి రీడింగ్ ప్రకారం యాజమాన్యమే చెల్లించే అవకాశం ఉంటుంది.

ఐసీడీఎస్ ఆఫీసులో అక్రమాలపై విచారణ

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


విచారణ జరుపుతున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ

మంథని, ఫిబ్రవరి 26: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల ఆరోపణలు, ఫిర్యాదులపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి మంథని కార్యాలయంలో సోమవారం విచారణ నిర్వహించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంథని ఐసీడీఎస్‌లో అక్రమాలు.. శీర్షికన ప్రచురితమైన కథనంతో పాటు, కమిషనర్‌కు సైతం ఫిర్యాదు వెళ్లడం తో కమిషనర్ ఆదేశాల మేరకు మంథని కార్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరుపుతున్నట్లు ఆర్జేడీ వెల్లడించారు. మంథని కార్యాలయంలో పని చేస్తున్న స్వరూప అనే సూపర్‌వైజర్ జనవరిలో విధులకు హాజరు కాకపోయి నా జీతం చెల్లించారని ఫిర్యాదు తోపాటు ఇతర ఆరోపణలు, అక్రమాలపై రికార్డులను, సూపర్‌వైజర్లను, ఆఫీసు ఉద్యోగులను విచారిస్తున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం నివేదికను కమీషనర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు.

నేటి నుంచి రైతులకు సాగునీరు విడుదల చేయాలి

ఎస్సారెస్పీ డీ-83 కెనాల్ సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఫిబ్రవరి 26: మంథని ప్రాంత రైతుల పంట పొలాలకు ఎస్సారెస్పీ డీ-83 కెనాల్ ద్వారా మంగళవారం ఉదయం నుంచి సాగునీటిని విడుదల చేసి పంటల రక్షించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సీఈ సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు. ఈమేరకు హైదరాబాద్‌లో సాగునీటి విడుదలపై సోమవారం సీఈ సుధాకర్‌రెడ్డితో మంత్రి శ్రీధర్‌బాబు సమీక్షించారు. డీ-83 కెనాల్ నుంచి గుండారం రిజర్వాయర్ ద్వారా కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాల వివిధ గ్రామాల రైతుల పొలాలకు వెంటనే సాగు అందించేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. డీ-83 కెనాల్ పై నుంచి వదిలే వాటర్‌ను అక్కడక్కడ మోటర్లు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కెనాల్‌కు మోటర్లు పెడుతున్నట్లు తెలిసిందని, ఎలాంటి పర్మిషన్ లేని మోటర్లకు కరెంట్ కట్ చేసి ఐనా మంథని ప్రాంత రైతులకు నీళ్లు అందించాలని సీఈకి సూచించారు.

పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 26: పౌరహక్కుల దినోత్సవాన్ని ఫిబ్రవరి 29న నిర్వహించాలని కోరుతూ ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు సోమవారం రామగిరి ఆర్ఐ రాజబాబుకు వినతిపత్రం అందజేశారు. దళిత బహుజన వర్గాలకు భరోసా కల్పించేలా రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించేందుకు సివిల్ రైట్స్‌డే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో సివిల్ రైట్స్‌డేకు ప్రాధాన్యత ఇస్తున్నా మండల స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో దిగువ స్థాయి అధికారులతో నామమాత్ర కార్యక్రమాలు జరుగుతున్నట్టు తెలిపారు. సివిల్ రైట్స్‌డే ప్రాధాన్యత నిమ్నవర్గాలకు తెలిసేలా సివిల్ రైట్స్‌డేపై ప్రచారం నిర్వహించి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు బూడిద సమ్మయ్య, మేకల సురేష్, కనకయ్య, రామస్వామి, రమేష్ ఉన్నారు.

కోల్‌సిటీటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సివిల్ రైట్స్‌డేను నిర్వహించాలని, అందులో మండంలోని అధికారులు పాల్గొనాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు షైస రాజేష్, కాంపెల్లి సతీష్ కోరారు. ఈమేరకు సోమవారం ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రామగుండం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ ఫిబ్రవరి 29న సివిల్ రైట్స్ డే(పౌర హక్కుల దినం)ను తూతు మంత్రంగా నిర్వహించకుండా తహసిల్దార్, ఎస్ఐ ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొనాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు విరుద్ధంగా కిందిస్థాయి సిబ్బందిని సివిల్ రైట్స్ డేకు పంపించడం వల్ల దళితుల సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శనిగరపు రామస్వామి, పోగుల రంగయ్య, బూడిద మహేందర్, పంజా అశోక్, కలువల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుపై విజిలెన్స్ విచారణ

- కాంటాక్టర్ నుంచి నగదు రికవరికి ఆదేశం

ఓదెల, ఫిబ్రవరి 26: మండలంలోని కనగర్తిలో రెండు కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన రోడ్డులో పలు అవకతవకలు జరగడంతో సుమారు ఐదు లక్షల రూపాయలను కాంట్రాక్టర్ నుంచి రికవరీకి కలెక్టర్ సోమవారం ఆదేశించారు. రోడ్డు నిర్మాణంలో జరిగిన పనులపై కనగర్తికి చెందిన చటికేసి సతీష్‌కుమార్ హైదరబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ప్రజావాణిలో డిసెంబరు 22న ఫిర్యాదు చేశారు. సీఎం కార్యాలయం దీనిపై విచారణకు జనవిరి 12న ఆదేశించగా రహదారులు, భవనాల శాఖకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో విచారణ జరిపి, రోడ్డు నిర్మాణంలో తగు ప్రమాణాలు పాటించలేదని నిర్ధారిస్తూ నివేదిక అందజేశారు. నివేదిక ఆధారంగా కాంట్రాక్టర్ జేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నుంచి ఐదు లక్షల 79 వేల 224 రుపాయల రికవరీకి కలెక్టర్ ఆదేశిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సతీష్‌కుమార్ మాట్లాడుతూ కనీసం 50 లక్షల విలువ గల పనిసైతం చేయకుండానే కాంట్రాక్టర్ కోట్లాది రుపాయలను జేబులో వేసుకోని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గ్రామంలో ప్రజల సమక్షంలో సామాజిక తనిఖీ చేపడితే రోడ్డు నిర్మాణంలో జరిగిన అక్రమాలన్ని బహిర్గతం అవుతాయని తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి

● ఎంపీపీ రాచకొండ లక్ష్మి


మాట్లాడుతున్న ఎంపీపీ రాచకొండ లక్ష్మి

కమాన్‌పూర్, ఫిబ్రవరి 26: రానున్న వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ రాచకొండ లక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తూ గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు కోలేటి చంద్రశేఖర్‌తో పాటు పలువురు సభ్యులు సభ దృష్టికి పలు సమస్యలను విన్నవించారు. వేసవి ప్రారంభం కాకముందే చేతి పంపుల మరమ్మతులు చేపట్టాలని, ఎస్సారెస్పీ కాలువ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి, నీటి ప్లాంట్ నిర్మాణానికి, ఉప కేంద్రానికి కేటాయించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆరిఫుద్దీన్, ఎంపీడీవో ఉమేష్, ఎంపీటీసీలు కోలేటి చంద్రశేఖర్, గొడిసెల ఉమ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలు స్వయంఉపాధిలో రాణించాలి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 26: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధిలో రాణించేందుకు వీవోఏలు కృషి చేయాలని ఏపీఎం దివ్య అన్నారు. సోమవారం జిల్లా సమాఖ్య కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'లక్‌పతి దీదీ' అనే పథకంపై ట్రైనర్ కళ్యాణి వీవోఏలకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం దివ్య మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో 60 వేల నుంచి లక్ష వరకు ఆదాయం ఉన్నవారిని మండలంలో 3500 మందిని గుర్తించినట్లు పేర్కోన్నారు. వారిని రెండేళ్లలో వారి అవసరాలను గుర్తించి లక్షాధికారులనే చేయడం పథకం లక్ష్యమని పేర్కోన్నారు. కార్యక్రమంలో సీసీలు, వీవోలు పాల్గొన్నారు.

రైల్వేలో నూతన విప్లవాన్ని తీసుకువస్తున్నాం

- విమానాశ్రయాలకు దీటుగా రైల్వేల అభివృద్ధి - వర్చువల్‌గా పెద్దపల్లి రైల్వే జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రధాని మోదీ




రైల్వే అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ, మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు, ఉప్పరపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం

పెద్దపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో నూతన విప్లవాన్ని తీసుకువచ్చామని, సామాన్యుడు సైతం రైళ్లలో ప్రయాణించే విధంగా తీర్చిదిద్దుతున్నామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సోమవారం అమృత్ భారత్ పథకంలో భాగంగా 26 కోట్ల 49 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పెద్దపల్లి రైల్వే జంక్షన్ అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా రిమోట్‌తో శంకుస్థాపన చేశారు. అలాగే కొత్తపల్లి-కొలనూర్ మధ్య ఎల్‌సీ 35వ గేట్ ఉప్పరపల్లి వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని కూడా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ పథకం రెండో దశలో దేశ వ్యాప్తంగా 554 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 15 రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నామని అన్నారు. విమానాశ్రయాలకు దీటుగా అమృత్ భారత్ పథకంలో భాగంగా దశలవారీగా దేశంలో ఉన్న అన్ని రైల్వే జంక్షన్లు, స్టేషన్లను ఆధునీకరిస్తున్నామన్నారు. అన్నివర్గాల ప్రజలకు రైల్వే సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మోదీ అన్నారు. అయితే పెద్దపల్లి రైల్వే జంక్షన్‌ను రెండో దశలో చేర్చినప్పటికీ, ఆరు నెలల నుంచే ఇక్కడ పనులు నడుస్తున్నాయి.

● **పెద్దపల్లి జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి: ఎమ్మెల్యే**

పెద్దపల్లి రైల్వే జంక్షన్ అభివృద్ధి పనుల కార్యక్రమంలో పాల్గొన్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఇక్కడ నిలపాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులను కోరారు. పెద్దపల్లి జిల్లా కావడంతో రైల్వేస్టేషన్ జంక్షన్‌గా కూడా అయ్యిందన్నారు. గతంలో కంటే పెద్దపల్లి నుంచి రైళ్లలో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ మార్గం గుండా వెళుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్, కేరళ ఎక్స్‌ప్రెస్, తదితర రైళ్లను ఇక్కడ నిలపాలని కోరారు. అలాగే కరీంనగర్ వయా పెద్దపల్లి మీదుగా తిరుపతికి వెళ్లే రైళ్లకు ఓదెల, పొత్కపల్లి స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఏడీఆర్ఎం మణి, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మున్సిపల్ చైర్మన్ దాసరి మమతారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బండారి రామ్మూర్తి, కౌన్సిలర్లు కొంతం శ్రీనివాస్‌రెడ్డి, నూగిళ్ల మల్లయ్య, రాజ మహంత కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● **రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం..**

ఓదెల: మండలంలోని ఉప్పరపల్లి శివారులో ఉన్న 89ఏ రైల్వే అండర్ బ్రిడ్జిని రైల్వే ఏడీఈఎన్ సమీర్ కుమార్ సోమవారం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ 15 వందల మేరకు నిర్మాణమైన అండర్ బ్రిడ్జిలను ఢిల్లీ నుంచి వర్చువల్‌గా సోమవారం ప్రారంభించగా, ఇందులో ఉప్పరపల్లి బ్రిడ్జి ఒకటి. అలాగే ప్రధాని రైల్వే అండర్ బ్రిడ్జిలను ప్రారంభించే ప్రక్రియను ఉప్పరపల్లి గేటు వద్ద వేదికను ఏర్పాటు చేసి వర్చువల్‌గా ప్రధాని సందేశాలను వినిపించారు. అలాగే కరీంనగర్ రైల్వే ఏడీఈఎన్ సమీర్ కుమార్ మాట్లాడుతూ.. 2015లో ఈ అండర్ బ్రిడ్జి మంజూరు అయ్యిందని, దీనిని రూ. 7.34కోట్ల వ్యయంతో నిర్మించామన్నారు. అలాగే లెవెల్ క్రాసింగ్ గేట్లను తొలగించేందుకు అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలను నిర్మించినట్లు తెలిపారు. ఈ పథకంలో భాగంగా కొలనూర్ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించగా, విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఉప్పరపల్లికి చెందిన మాజీ సర్పంచులు వినతిపత్రాన్ని అందజేస్తూ, అండర్ బ్రిడ్జిలో నీటి నిల్వ ఉండడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే సైడ్ డ్రైన్ కాలువలను నిర్మించాలని కోరారు.

అనంతరం ఎంపీపీ రేణుకాదేవి మాట్లాడుతూ, ఓదెలలో తిరుపతి రైలు ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ చేయించాలని కోరారు. ఎంపీటీసీ కారెంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇబ్బందులు లేకుండా ఫ్లై ఓవర్ రోడ్లను నిర్మించాలని, అలాగే కొలనూర్‌లో కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ చేయించాలని కోరారు. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏడీఈఎన్ తెలిపారు. కార్యక్రమంలో సీఐ జగదీష్, ఎంపీడీవో తిరుపతి, ఎస్సై అశోక్‌రెడ్డి, హెచ్ఎం ఏసుదాసు, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

రామగుండం ఎస్ఐగా కందునూరి సతీష్



బాధ్యతలు స్వీకరిస్తున్న కె సతీష్

అంతర్గాం, ఫిబ్రవరి 26: రామగుండం ఎస్ఐగా కందునూరి సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంటలీజెన్స్‌లో ఎస్ఐగా పని చేస్తున్న సతీష్ బదిలీపై రామగుండం ఎస్ఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండంలో శాంతి భద్రతలు కాపాడడం కోసం కృషి చేస్తానని చెప్పారు.

'ప్రజావాణి'కి విన్నపాల వెల్లువ


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను పరిష్కరిలంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతిపత్రాలను అందజేశారు. నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె ప్రకాష్ ఆన్‌లైన్ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌లో నేతకాని అక్షర దోషం పడుతుందని, దీనిని సరిచేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా కలెక్టరేట్ సి విభాగం సూపరింటెండెంట్‌కు రాస్తూ లేఖ ద్వారా ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. రామగుండం మండలం అల్లూరు గ్రామానికి చెందిన మడక సంపత్ తాను దివ్యాంగ నిరుపేదనని, డిగ్రీ పూర్తి చేసి ఎలాంటి ఉపాధి లేకుండా జీవిస్తున్నానని ప్రభుత్వం ద్వారా మీ సేవ ఏర్పాటు చేసుకునరేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ఈడీఎంకు రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాల్వశ్రీరాంపూర్ మండలం ఆరేపల్లి మాజీ సర్పంచ్ పున్నమినేని దేవేందర్ రావు గ్రామ పంచాయతీ భవనం ప్రహరీ నిర్మించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు రాస్తూ సమస్య పరి శీలించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ కలెక్టరే ట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, అధికారులకు వైద్య పరీక్షలు నిర్వహించామని, సిబ్బంది పాటించాల్సిన ఆహార పు అలవాట్లపై అవగాహన కల్పించేందుకు న్యూట్రిషన్‌తో అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే ఉద్యోగులందరికీ ఆర్థిక అక్షరాస్యత కల్పిస్తూ, బ్యాంకులో, పోస్టు ఆఫీసుల్లో మనకు పెట్టుబడి కోసం అందుబాటులో ఉన్న పథకాలు, వివిధ అంశాలను తెలియజేసేందుకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారిచే ఆర్థిక అక్షరాస్యతపై రూపొందించిన పోస్టర్‌ను, పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్‌డీ నాయకులు

పౌష్టికాహారం పంపిణీ చేయాలి

పెద్దపల్లిటౌన్: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంథని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గర్భిణులకు, బాలింతలకు, ప్రీస్కూల్ పిల్లలకు అందాల్సిన పౌష్టికాహారం కందిపప్పు, పాలు, కోడిగుడ్లు సకాలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సప్లై చేయాలని కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి జ్యోతి మాట్లాడుతూ మూడునెలలుగా కందిపప్పు సరిపడా సరఫరా చేయలేదని ఈ విషయమై ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. పాలు, కోడిగుడ్లు కూడా ప్రతీసారి వారం నుంచి పది రోజుల వరకు ఆలస్యంగా వస్తుందన్నారు. జిల్లా అధికారులకు ఈ విషయం తెలిసినప్పటికీ సరఫరాదారులపై చర్యలు తీసుకోవడంలేదన్నారు.

● **వీధిదీపాలు ఏర్పాటు చేయాలి..**

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దబొంకూరు గ్రామంలో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో వీధిదీపాలు వెలుగకపోవడంతో పాటు కోతుల బెడద అధికంగా ఉందని వీటిపై దృష్టి సారించి ప్రజలకు రక్షణ కల్పించాలని మిట్టపల్లి శ్రీనివాస్ కలెక్టర్‌ను కోరారు.

● **కోనోకార్పస్ చెట్లను తొలగించాలి..**

కోల్‌సిటీటౌన్: కోనోకార్పస్ చెట్లపై ప్రభుత్వం పరిశోధన చేయించి రాష్ట్రంలో ఉన్న చెట్లను తొలగించాలని స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ (ఎస్ఎఫ్‌డి) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ ముజ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపల్ ప్రాంతాల్లో ఉద్యానవనాలు, పలుచోట్ల రోడ్ల మధ్యలో, గ్రామాల్లో గత ప్రభుత్వం కోనోకార్పస్ మొక్కలను నాటించిందని, వాటి వల్ల ఆరోగ్య సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు, ఆస్తమా, బ్లడ్‌క్యాన్సర్, మాతృత్వం కోల్పోయే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ విష్ణుభక్తుల రిషి, నాయకులు రవి, కిరణ్, సంతోష్, మణిదీప్ పాల్గొన్నారు.



సిరిసేడు ఎంపీటీసీపై అనర్హత వేటు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 26: మండలంలోని సిరిసేడు ఎంపీటీసీ రేణికుంట్ల చిన్నరాయుడుపై అనర్హత వేటు వేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రమేలా సత్పతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 9న చిన్నరాయుడుతో పాటు రామస్వామి, శశికుమార్, రమేష్‌లు సిరిసేడు, బోగంపాడు గ్రామాలకు చెందిన పల్లె ప్రకృతి వనాన్ని జేసీబీ సహాయంతో ధ్వంసం చేసి ఆ స్థలాన్ని కబ్జా చేయాలని చూశారని స్థానిక పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, అంకూస్‌లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగింది. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రమేలా సత్పతి పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సిరిసేడు ఎంపీటీసీ చిన్నరాయుడుపై అనర్హత వేటు వేయడంతో పాటు అతడు ఆరు సంవత్సరాలు ఎలాంటి పదవికి పోటీకి అనర్హుడని ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 26: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 56మంది రైతులు 528క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 28క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ గరిష్ఠ ధర రూ.7150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు.. తప్పిన ప్రమాదం

మానకొండూర్, ఫిబ్రవరి 26: మండలంలోని అన్నారం గ్రామంలో ఓ కారు పొలంలోకి దూసుకెళ్లడంతో పెనుప్రమాదం తప్పింది. మండలంలోని దేవంపల్లి గ్రామ మాజీ సర్పంచు జనగామ దేవేందర్‌రావు వ్యక్తిగత పనులపై తన కారులో మానకొండూర్‌కు వెళ్లి తిరిగి దేవంపల్లికి వస్తున్నాడు. అన్నారం గ్రామ శివారులో కారు అదుపు తప్పి వరిపొలంలోకి దూసుకెళ్లింది. స్థానికులు గమనించి కారులో ఉన్న దేవేందర్‌రావును బయటికి తీశారు. రోడ్డు పక్కనే వ్యవసాయబావి ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఆయనకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.


అన్నారంలో వరిపొలంలోకి దూసుకెళ్లిన కారు

భారీ ఎత్తున ఇసుక డంపింగ్

● కేసు నమోదు చేసిన పోలీసులు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 26: మండలంలోని వంతడుపులలో అక్రమంగా ఇసుకను డంపింగ్ చేసి వరంగల్ జిల్లాకు తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా నుంచి అక్రమంగా ఇసుకను తరలించి వంతడుపుల గ్రామంలో డంపింగ్ చేసి అక్కడ నుంచి వరంగల్ తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెండు ట్రాక్టర్లలో ఇసుక నింపుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. 20 ట్రాక్టర్ల ఇసుకను తహసీల్దార్‌కు అప్పగించి సదరు ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 8 మందికి శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 26: డ్రంకెన్ డ్రైవ్ కేసులో 8 మంది వాహనదారులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ జైలుశిక్ష, జరిమానాలు విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. ఇటీవల పట్టుబడిన 16 మంది వాహనదారులను సోమవారం కోర్టులో హాజరుపరచగా ఇద్దరికి 10 రోజులు, ఒకరికి 7 రోజులు, ఒకరికి 5 రోజులు, నలుగురు వ్యక్తులకు 3 రోజుల వంతున జైలుశిక్ష, మొత్తం 16 వేల రూపాయల జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు. మరో 8 మందికి 15 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏఈకి గాయాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 26: కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనరావుపేటలో పంచాయతీరాజ్ ఏఈగా పనిచేస్తున్న అంజయ్యకు గాయాలయ్యాయి. వివరాల ప్రకారం ఏఈ అంజయ్య ద్విచక్రవాహనంపై వేములవాడ వైపు వెళుతున్న సమయంలో సుద్దాల మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడం వల్ల చేతికి గాయాలయ్యాయి. గాయాలైన ఏఈని సిరిసిల్ల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ముస్తాబాద్, ఫిబ్రవరి 26: ముస్తాబాద్ మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కంచం ప్రసాద్ (45) అప్పుల బాధతో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన ప్రసాద్ తన కూతురు పెళ్లి కోసం, కొడుకు కోసం అప్పు చేశాడు. అప్పు తీరే మార్గం లేక మనస్థాపంతో ఇంట్లో ఉరివేసుకున్నాడు. ప్రసాద్ భార్య సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ముస్తాబాద్, ఫిబ్రవరి 26: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలయ్యాడు. కొండాపూర్ గ్రామానికి చెందిన సర్దాని అజయ్‌కుమార్ అనే యువకుడు ముస్తాబాద్ నుంచి కొండాపూర్‌కు ద్విచక్రవాహంపై వెళుతుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి పడిపోయాడు. వాహనదారులు గమనించి అంబులెన్స్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 26: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన జనగామ రాజమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయిన రాజమ్మ ఆదివారం ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సోమవారం తెల్లవారుజామున 11ఏ క్రాస్ రోడ్డు వద్ద రాజమ్మను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. రోడ్డు వెంట వెళ్తున్న వాహనదారుల సమాచారంతో 108 సిబ్బంది గాయపడ్డ రాజమ్మను గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించేలోపే రాజమ్మ మృతి చెందింది. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.

చెట్టుకొమ్మ మీదపడి ఒకరి మృతి


కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 26: చెట్టు కొమ్మ కొడుతూ ప్రమాదవశాత్తు ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని పెన్నంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. పెన్నంపల్లి గ్రామానికి చెందిన మేడి రాజు (35) కట్టెల కోసం సోమవారం గ్రామ శివారులోని గుర్రాల గండి ప్రాజెక్టు సమీపానికి వెళ్లాడు. చెట్టు కొమ్మ కొడుతుండగా ప్రమాదవశాత్తు రాజుపై పడింది. తీవ్ర గాయాలైన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కిరాణ వ్యాపారి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 26: కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన కొమిడి జలపతిరెడ్డి(55) సోమవారం సాయంత్రం ఇంటి వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జలపతిరెడ్డి ఆదర్శనగర్‌లో కిరాణ షాపు నిర్వహిస్తుంటాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు కాగా వారికి వివాహం జరిగిందని బంధువులు తెలిపారు. ఆదివారం తన భార్య, కూతురును హైదరాబాద్‌లో దిగబెట్టి సోమవారం ఉదయమే ఇంటికి వచ్చిన జలపతిరెడ్డి సాయంత్రం ఇంటి వెనుకవైపున ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

















డాక్టర్

జెరియాట్రిక్



'వయసు పైబడుతోంది కదా! మునుపటి ఓపిక ఉండదులే! ఇదంతా సహజం' అని సరిపెట్టుకుంటున్నారా? కానీ మలి వయసుకు చేరుకుంటున్నా, సత్తువ సడలకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

ఎనభైలో నలభైలా







వయసు పైబడేకొద్దీ పుట్టిన రోజు దగ్గర పడుతుంటే గుండెల్లో బేజారు మొదలవుతూ ఉంటుంది. యాభైకి చేరుకుంటే అర్థాయుష్షు అయిపోయిందే అని కొంత నిరాశకు లోనయ్యేవాళ్లూ ఉంటారు. నిజానికి ఒంట్లో తగ్గిపోయే హుషారు, చలాకీతనం, పెరిగిపోయే నిస్సత్తువ, నీరసాలు పైబడే వయసును అనుక్షణం గుర్తు చేస్తూనే ఉంటాయి. 'అప్పట్లో నేను అలవోకగా పనులన్నీ చేసుకోగలిగేదాన్ని, సునాయాసంగా పనులన్నీ చక్కబెట్టేదాన్ని, చకచకా పరుగులెత్తేదాన్ని' అని పాత రోజుల గురించి గర్వంగా చెప్పుకోవడమే కాదు, అదే ఆరోగ్యాన్నీ, శరీర దారుఢ్యాన్నీ మున్ముందు కూడా కొనసాగించే వీలుంది. అయితే అందు కోసం ప్రణాళికాబద్ధంగా నడుచుకోవాలి. చేసే పనులు, తీసుకునే ఆహారం పట్ల శ్రద్ధ కనబరచాలి. మరీ ముఖ్యంగా మనసు వయసు పైబడనీయకూడదు.

క్రమం తప్పని వ్యాయామం

పైబడే వయసులో కండరాల నొప్పులు వేధిస్తున్నాయంటే, కండరాల పటుత్వం తగ్గిందని అర్థం. కీళ్ల నొప్పులు మొదలైనప్పుడు, రోజూ నడవడం మొదలు పెట్టండి అని వైద్యులు సూచిస్తూ ఉంటారు. కీళ్ల అరగడం మొదలైతే నడవడం వల్ల అవి ఇంకా వేగంగా అరిగిపోతాయి కదా? అని అయోమయానికి గురి కాకూడదు. నడక వల్ల కాళ్లలోని కండరాలు బలం పుంజుకుని ఊతాన్నిస్తాయి. దాంతో కీళ్ల మీద ఒత్తిడి తగ్గి అవి అరిగే వేగం నెమ్మదిస్తుంది. పైగా రోజు మొత్తంలో పది వేల అడుగులు నడిచే వ్యక్తుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని శాస్త్రీయంగా రుజువైంది. కాబట్టి కండరాల పటుత్వం కోసం నడక, ఈత, సైక్లింగ్... ఇలా నచ్చిన వ్యాయామానికి దైనందిన జీవితంలో చోటు కల్పించాలి. ఏరోబిక్స్‌తో పాటు రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయవచ్చు. ఎముకల దృఢత్వం కోసం వెయిట్ ట్రైనింగ్ కూడా చేస్తూ ఉండాలి. బరువులు ఎత్తడం వల్ల కండరాలు బలం పుంజుకోవడంతో పాటు, శారీరక దారుఢ్యం కూడా పెరుగుతుంది.

సమతులాహారం

ఆదివారం వస్తే నాన్ వెజ్, మిగతా రోజులంతా వెజిటేరియన్ వంటకాలను వండుకోవడం మన ఆనవాయితీ. కానీ అన్ని రకాల పోషకాలూ సమపాళ్లలో అందాలంటే ఏ పదార్థాల్లో ఏ పోషకాలుంటాయో అవగాహన ఏర్పరుచుకుని రోజు మొత్తంలో సరిపడా పోషకాలన్నీ అందుతున్నాయో లేదో గమనించుకుంటూ ఉండాలి. నాన్ వెజ్ వండుకుని తింటే ప్రొటీన్ ఒక్కటే అందుతుంది. మరి మిగతా విటమిన్లు, ఖనిజ లవణాలు, సూక్ష్మపోషకాల మాటేమిటి? అలాగే కేవలం ఒక్క కూరగాయతో సరిపెట్టుకుంటే ప్రొటీన్ దక్కేదెలా? కాబట్టి వారాంతాల్లో నాన్‌వెజ్‌కు పరిమితమయ్యేవాళ్లు, కూరగాయలతో కలిపి నాన్ వెజ్ వండుకోవడం, లేదా అదనంగా వెజిటేరియన్ వంటకం చేసుకోవడం అవసరం. అలాగే కూరగాయలను పప్పుదినుసులతో కలిపి వండుకోవడం, గుడ్డుతో కలిపి వండుకోవడం లాంటివి కూడా చేయవచ్చు.



ప్రొటీన్ సరిపడా

సంపూర్ణ ఆరోగ్యానికి, రక్తహీనత తలెత్తకుండా ఉండడానికీ సరిపడా ప్రొటీన్ అవసరం. మాంసాహారం తినలేనివాళ్లు కంది, పెసరపప్పులను తినవచ్చు. చిక్కుళ్లు, బఠాణీ, మునగ, పుట్టగొడుగుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ప్రతి రోజూ ఆహారంలో సరిపడా ఉండేలా మీల్ ప్లాన్ చేసుకోవాలి. అల్పాహారం తీసుకోవడం తప్పనిసరి. ఉదయం తినే అల్పాహారంలో ప్రొటీన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఉడకబెట్టిన సెనగలు, బొబ్బర్లు, మొలకలు లాంటి వాటిని సాయంత్రం స్నాక్‌గా తీసుకోవచ్చు.

ద్రవాలూ ముఖ్యమే!

ఒళ్లు నొప్పులకు శరీరంలో నీటి శాతం తగ్గడం ఒక కారణం. కండర నొప్పులు తరచూ వేధిస్తున్నా, కండరాలు పట్టేస్తున్నా శరీరంలో నీరు తగ్గిందని అర్థం చేసుకుని సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి. గుండె, కిడ్నీ సంబంధ వ్యాధులు లేనివాళ్లు రోజుకు కనీసం 3 లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి. ఇది వేసవి కాలం కాబట్టి పండ్ల రసాలూ, కొబ్బరినీళ్లు, పలుచని మజ్జిగ కూడా తీసుకోవచ్చు. సబ్జా నీళ్లు ఆరోగ్యకరం. శరీరాన్ని చల్లబరిచే నిమ్మరసం, క్యారట్, బీట్‌రూట్ జ్యూస్ తాగుతూ ఉండాలి. శీతల పానీయాలు, చక్కెర కలిసి ఉండే పౌడర్ ఆధారిత పానీయాలు, సిరప్స్ దాహార్తిని తీర్చకపోగా, శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశాలను పెంచుతాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండాలి.



సరిపడా విశ్రాంతి

కంటి నిండా నిద్ర, సరిపడా విశ్రాంతి కూడా అవసరమే! చలాకీగా, చురుగ్గా కదలడానికి సరిపడా ఓపిక శరీరానికి దక్కాలంటే, మధ్నాహ్నం వేళ ఒక అరగంట పాటు కునుకు తీస్తూ ఉండాలి. దాంతో కండరాలు శక్తిని పుంజుకుంటాయి. 7 నుంచి 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవడం వల్ల శరీర బడలిక వదిలి, కొత్త శక్తిని పుంజుకుంటుంది. కాబట్టి నిద్రకు భంగం కలిగించే అంశాలకు దూరంగా ఉంటూ, కంటి నిండా నిద్రపోవాలి.

ఎముకల పటుత్వం ఇలా సాధ్యం

పైబడే వయసులో ఎముకల పటుత్వం క్షీణించడం సహజం. అలా జరగకుండా నియంత్రించాలంటే పోషకాహారంతో పాటు కొన్ని అదనపు సప్లిమెంట్లు కూడా తీసుకుంటూ ఉండాలి. అవేంటంటే...

- **క్యాల్షియం:** అరవై ఏళ్లు పైబడిన స్త్రీపురుషులు క్యాల్షియం సమృద్ధిగా దొరికే పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, డ్రై సీడ్స్, బాదం, పిస్తా తప్పనిసరిగా తీసుకోవాలి. ఆహారం ద్వారా సరిపడా క్యాల్షియం దక్కే వీలు లేని సందర్భాల్లో వైద్యులు సూచించిన సప్లిమెంట్లు వాడుకోవచ్చు.
- **విటమిన్ డి:** ఎముకల దృఢత్వానికి డి విటమిన్ అవసరం. ఆహారం ద్వారా దొరికే అవకాశం లేని డి విటమిన్‌ను పొందడం కోసం కనీసం ఒకటి నుంచి రెండు గంటల పాటు ఎండలో గడపడం అవసరం. సాధ్యపడని సందర్భాల్లో వైద్యులు సూచించే సప్లిమెంట్లు వాడుకోవాలి.
- **వ్యాయామాలు:** నడక, పరుగు, బరువులెత్తడం, సైక్లింగ్ శరీరం మీద బరువు పడేలా చేసే వ్యాయామాలన్నీ ఎముకల పటుత్వాన్ని పెంచుతాయి. నడి వయసులో తుంటి ఎముకలు తేలికగా విరిగిపోతూ ఉండడానికి కారణం ఎముకలు గుల్లబారడమే! ఈ సమస్య తలెత్తకుండా ఉండాలంటే మరీ ముఖ్యంగా మహిళలు బరువులతో కూడిన వ్యాయామాలు చేయాలి.
- **ఇవి వద్దు:** ఆల్కహాల్, చక్కెర, కాఫీలు ఎముకల సాంద్రతను తగ్గిస్తాయి. వీటికి వీలైనంత దూరంగా ఉండాలి. ముఖ్యంగా ధూమపానం ఎముకలకు హానికరం. కాబట్టి ఈ అలవాటు ఉన్నవాళ్లు నడవయసుకు చేరుకున్న తర్వాత పూర్తిగా మానేయాలి.
- **ఆరోగ్య పరీక్షలు:** 55 ఏళ్లు దాటిన మహిళలు, 65 ఏళ్లు దాటిన పురుషులు ప్రతి మూడేళ్లకోసారి ఎముకల సాంద్రతను పరీక్షించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షతో ఎముకల సాంద్రతను అంచనా వేస్తూ, అప్రమత్తం అవుతూ ఉండాలి. ఎముకలు గుల్లబారే సమస్యను ఈ పరీక్షతో గుర్తించినప్పుడు వైద్యులు సూచించిన మందులు తీసుకోవాలి. వ్యాయామాలు మొదలుపెట్టాలి.

జీవనశైలి వ్యాధులు రాకుండా....

45 ఏళ్లు దాటిన వాళ్లలో అధిక రక్తపోటు, మధుమేహాలు సర్వసాధారణమైపోతున్న కాలమిది. ఇలాంటి జీవనశైలి వ్యాధులు దాడి చేయకుండా ఉండాలంటే...

- వయసు పైబడేకొద్దీ కణాల్లో జరిగే ఆక్సిడేషన్ డ్యామేజీ వల్ల కేన్సర్ వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా దొరికే తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఆహారంలో పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. నిల్వ ఉన్న పదార్థాలు, ప్యాకేజ్డ్ ఫుడ్, చక్కెర, ఉప్పు, నూనెలు ఎక్కువగా ఉండే పదార్థాలను తినడం మానేయాలి.
- కొన్ని దీర్ఘకాలిక వ్యాధులకు మానసిక ఒత్తిడే ప్రధాన కారణం. ప్రాణాయామం, ధ్యానం ద్వారా ఒత్తిడిని వదిలించుకోవాలి. ఇంటి పట్టున ఉండేవాళ్లు నచ్చిన ఏదో ఒక వ్యాపకాన్ని ఎంచుకోవాలి. మెదడును చురుగ్గా ఉంచే ఇండోర్ గేమ్స్, శరీరాన్ని చురుగ్గా ఉంచే ఔట్‌డోర్ గేమ్స్ ఆడుతూ ఉండాలి.
- **వైద్య పరీక్షలు:** అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలున్నవాళ్లు క్రమం తప్పక పరీక్షలు చేయించుకుంటూ వాటిని అదుపులో ఉంచుకోవాలి. సంబంధిత వైద్య నిపుణులను కూడా సంప్రతిస్తూ ఉండాలి. అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్నవాళ్లు ఏడాదికోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. గుండెజబ్బు, మధుమేహం ఉన్నవాళ్లు ఆరు నెలలకోసారి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షలతో ప్రారంభంలోనే సమస్యను గుర్తించే వీలుంటుంది.

డాక్టర్ వేద ప్రకాష్ జి
సీనియర్ కన్సల్టెంట్,
ఆర్థోపెడిక్ సర్జన్ అండ్
జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్.



సైకాలజీ

ఇదీ ఓ కారణమే!

కొందరి మానసిక సమస్యలకు వారి వ్యక్తిత్వాలూ కారణమవుతూ ఉంటాయి. కాబట్టి సమస్యనుబట్టి ఎవరికి వారు లోతుగా విశ్లేషించుకుని, వ్యక్తిత్వంలో స్వల్ప మార్పులు చేసుకోగలిగితే ఇబ్బందులు సర్దుకుంటాయి. ఉదాహరణకు....

- సోషల్ యాంగ్జయిటీ, ప్యానిక్ అటాక్స్, డిప్రెషన్: మానసికంగా కుంగిపోయినప్పుడు ఇతరుల సహాయాన్ని అర్థించకుండా ఒంటరిగా ఉండడానికే ఇష్టపడతారు. ఇలాంటివాళ్లు సరైన సమయంలో వైద్యులతో మాట్లాడితే సమస్య సర్దుకుంటుంది.



- డిప్రెషన్, యాంగ్జయిటీ: పర్‌ఫెక్షనిస్టులు వాళ్ల గురించి వాళ్లు ఎక్కువ అంచనాలు కలిగి ఉంటారు. తమని ఓడించడం ఎవరి తరమూ కాదనే నమ్మకంతో ఉంటారు. దాంతో ఎప్పుడైనా ఓటమిపాలైతే విపరీతంగా కుంగిపోయి, డిప్రెషన్‌లో కూరుకుపోతారు. ఇలాంటప్పుడు ఒత్తిడికి లోనయినట్టు మీ శరీరం చెబుతున్న విషయాన్ని ఆలకించాలి. అంచనాలు తగ్గించుకుని ప్రశాంతంగా ఆలోచించడం మొదలుపెడితే మానసికి ఇబ్బందులు సమసిపోతాయి.
- బైపోలార్ డిజార్డర్ డిప్రెషన్: సృజనాత్మక వ్యక్తులు గతాన్ని తరచుగా తలుచుకోవడం, జరిగిపోయినదానికి చింతిస్తూ ఉండే వ్యక్తిత్వం కలిగి ఉంటారు. ఇలాంటివాళ్లు మానసిక సమస్యలకు గురి కాకుండా ఉండాలంటే, మానసిక స్థిరత్వాన్ని పెంపొందించుకుని, తమకున్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దాలి.

ఆయుర్వేదం

మెదడు చురుకుగా...

జ్ఞాపకశక్తి, తెలివితేటలు తగ్గడానికి కారణం పోషకాహార లోపం, మెదడులో తయారయ్యే రసాయనాలలో అసమతౌల్యమే ప్రధాన కారణాలని ఆయుర్వేదం చెబుతోంది. ఈ మార్పులు సహజసిద్ధంగా శరీరంలో జనించవచ్చు, లేదా మందుల ప్రభావం వల్ల కూడా తలెత్తవచ్చు. కఫ దోషం వల్లే జ్ఞాపకశక్తి సన్నగిల్లుతుందని ఆయుర్వేదం నమ్ముతోంది. ఈ దోషం ఫలితంగా మెదడు పనితీరు మందగించి, ఆలోచనల్లో అస్పష్టత చోటుచేసుకుంటుంది. కాబట్టి జ్ఞాపకశక్తి పెరగాలంటే వాత, కఫ దోషాలను సమతులం చేయాలి. వాత, కఫ దోషాల సమ్మేళనం జ్ఞాపకశక్తిని పెంచుతుంది. పిత్త దోషం మెదడు చురుకుదనాన్ని మెరుగుపరుస్తుంది. అయితే ఈ దోషాలన్నీ సమతులం కావాలంటే ఆహారవ్యవహారాల్లో కొన్ని మార్పులు చేసుకోవాలి.




- **ఆహారం:** దోష తత్వం ఆధారంగా ఆహారశైలిని అనుసరించాలని ఆయుర్వేదం సూచిస్తున్నా, మరీ ముఖ్యంగా జ్ఞాపకశక్తికి సంబంధించి కొన్ని నిర్దిష్టమైన ఆహారనియమాలు పాటించవలసి ఉంటుందని కూడా ఆయుర్వేదం సూచిస్తోంది. అవేంటంటే...
- సులువుగా అరిగే, ఒంట్లోని విషాలను హరించే ఆహారంతో శరీరంలో కఫ సంబంధ అవరోధాలు తొలగి, వాత మార్గాలు తెరుచుకుంటాయి. అలాగే ఇలాంటి ఆహారం పిత్త పనితీరును పెంచి, తత్ఫలితంగా జ్ఞాపకశక్తినీ, తెలివితేటలనూ పెంచుతుంది.
- కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, నెయ్యి, నారింజ, క్యారెట్లు, నట్స్‌లతో కూడిన సమతులాహారం తీసుకోవాలి.
- జున్ను తినకూడదు. మాంసాహారానికి దూరంగా ఉండాలి.
- జ్ఞాపకశక్తి, తెలివితేటలను పెంచే వాత, పిత్త, కఫ దోషాల మధ్య సమతులం సాధించాలంటే బెల్లం లేదా తేనెలకు దీర్ఘకాలం పాటు ఆహారంలో చోటు కల్పించాలి.
- టీ, కాఫీలకు దూరంగా ఉండాలి.

గుడ్ ఫుడ్

మెంతులు మేలు!

మెంతులను నిల్వ పచ్చళ్లలో తప్ప వంటకాలలో పెద్దగా ఉపయోగించం. కానీ పిల్లలకు పాలిచ్చే తల్లులకు మెంతులు మేలు చేస్తాయి. పాల ఉత్పత్తిని పెంచి, పసికందుకు పాల కొరత తీరుస్తాయి.

పిల్లలకు పాలిచ్చే తల్లుల ఆహారంలో మెంతులను చేర్చడం మన దేశ ఆనవాయితీ. ఉత్తర భారతదేశంలో మెంతి లడ్డు, దక్షిణాదిన పొడులు, ముద్దల రూపంలో వాడుతూ ఉంటారు. ఈ సంప్రదాయం వెనక సైన్స్ దాగి ఉంది. ప్రసవించిన మహిళలకు మెంతులు ఎంతో ఉపయోగకరం. వారిలో పాల ఉత్పత్తిని పెంచుతాయని జంతువులు, మనుషుల మీద జరిపిన పలు పరిశోధనల్లో రుజువైంది. 'గ్యాలెక్టగోగ్' అనే పాల ఉత్పత్తికి తోడ్పడే మూలిక లేదా ఔషధంగా మెంతులను వర్గీకరించారు. ఈ విత్తనాల్లో ఉండే 'డయాస్టొనిన్' పాల ఉత్పత్తి జరిగే మామరీ గ్రంథులలోని కణజాలం పెరుగుదలకు, తోడ్పడుతుంది. ఫలితంగా పాలు త్వరితంగా, ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. ఇందుకోసం రోజుకు 10 విత్తనాలు తీసుకుంటే సరిపోతుంది.



రోజుకు ఒకటి లేదా రెండు మెంతి లడ్డను పాలిచ్చే తల్లులకు తినిపంచవచ్చు. వీటికి బెల్లం, శొంఠి, డ్రై ఫ్రూట్స్, నెయ్యి జోడించాలి. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో మెంతి పొడికి, పసుపు, శొంఠి, బెల్లం, ఇతర మూలికలు చేర్చి ఉడికించి, హల్వా ఉండగా చేసి పరగడుపున తినిపించడం ఆనవాయితీ. ఒకవేళ బరువు పెరగకుండా మెంతుల మేలు అందుకోవాలనుకుంటే, మెంతులను రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉదయం పరగడుపున తీసుకోవచ్చు. ప్రత్యామ్నాయంగా మెంతులను పొడి చేసి, తేనె లేదా గోరువెచ్చని నీళ్లతో కలిపి తీసుకోవచ్చు. అయితే గర్భిణులు మెంతులకు దూరంగా ఉండాలి. గ్యాలెక్టగోగ్ కోవకు చెందిన మెంతుల్లో యుటెరోటోనిక్ ఏజెంట్ ఉంటుంది. ఇది కండరాల సంకోచవ్యాకోచాలకు కారణమవుతుంది. కాబట్టి గర్భవిచ్ఛిత్తికి ఆస్కారం ఉంటుంది.

కెగెల్ ఎక్సర్‌సైజెస్

నడుము దృఢంగా!

కొన్ని వ్యాయామాలు అంతర్గత జీవక్రియలు, వ్యవస్థల పనితీరును క్రమబద్ధీకరిస్తాయి. దైనందిన జీవితానికి ఇబ్బంది పెట్టే స్వల్ప సమస్యలనూ పరిష్కరిస్తాయి. అలాంటి వాటిలో చెప్పుకోదగినవి 'కటి వ్యాయామాలు'!

కటికి సంబంధించిన కొన్ని వ్యాయామాలు స్త్రీపురుషులు ఇద్దరికీ ఉపయోకరమే! కటి ప్రదేశంలోని కండరాలు బలపడే ఈ వ్యాయామాలు చేయడం వల్ల మూత్ర వ్యవస్థకు సంబంధించిన కొన్ని సమస్యలు దూరమవుతాయి. మరీ ముఖ్యంగా తుమ్మినా, దగ్గినా మూత్రం లీక్ అయిపోయే ఇబ్బంది తొలుగుతుంది. స్త్రీలలో ప్రసవానంతరం తలెత్తే ఈ రకం సమస్య కటి వ్యాయామాలతో అదుపులోకి వస్తుంది. ఈ వ్యాయామాలను అమెరికాకు చెందిన స్త్రీల వైద్యులు 'అర్నాల్డ్ కెగెల్' కనుగొన్నారు కాబట్టి వీటికి 'కెగెల్ ఎక్సర్‌సైజెస్' అనే పేరొచ్చింది.

కెగెల్ వ్యాయామాలు అంటే?

ఈ వ్యాయామాలనే 'పెల్విక్ ఫ్లోర్' వ్యాయామాలు అని కూడా అంటారు. కటిలోని కండరాలను బిగదీసి, వదిలే ఈ వ్యాయామాలు రోజు మొత్తంలో ఎన్ని సార్లైనా చేయవచ్చు. సరైన ఫలితం దక్కడం కోసం కనీసం 3 నెలల పాటు వ్యాయామాలు చేయాలి. తేలికగా ఉండే ఈ వ్యాయామాలను రోజులో ఏ సమయంలోనైనా చేయవచ్చు. కూర్చున్నా, పడుకుని ఉన్నా కూడా ఈ వ్యాయామాలు చేయవచ్చు. తింటున్నప్పుడు, కుర్చీ మీద కూర్చుని పని చేసుకుంటూ, టివి చూస్తూ విరామంగా ఉన్నప్పుడు కూడా చేయవచ్చు.

ఆరోగ్య ప్రయోజనాలు

- విసర్జక వ్యవస్థ అదుపులో ఉండేందుకు ఈ వ్యాయామాలను స్త్రీపురుషులు ఇద్దరూ చేయవచ్చు.
- శస్త్రచికిత్సల తదనంతరం కండరాలను బలోపేతం చేయడం కోసం ఈ వ్యాయామాలను అనుసరించాలి. ప్రొస్టేట్ సంబంధిత శస్త్రచికిత్సల తదనంతరం పురుషులు, పునరుత్పత్తి వ్యవస్థల సంబంధిత శస్త్రచికిత్సల అనంతరం స్త్రీలు ఈ వ్యాయామాలను చేయాలి.
- వృద్ధాప్యం మూలంగా బలహీనపడే కటి కండరాల బలోపేతానికి కూడా ఈ వ్యాయామాలు ఉపయోగకరం.
- ప్రసవం తదనంతరం మహిళలు ఈ వ్యాయామాలను క్రమం తప్పక చేస్తే పునరుత్పత్తి సంబంధిత అంతర్గత అవయవాలన్నీ తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి.
- మూత్రాశయం, దాని చుట్టుపక్కల కండరాలు ఈ వ్యాయామంతో బలపడతాయి. కాబట్టి చిన్న ఒత్తిడికే మూత్రం కారిపోయే పరిస్థితి ఉన్న స్త్రీపురుషులు ఈ వ్యాయామాలు ఎంచుకోవాలి.
- పొట్టలోని పేగులు పొత్తికడుపులోకి జారే సమస్య ఉన్నవారు కూడా ఈ వ్యాయామాలు చేయాలి.
- తెలియకుండా మలవిసర్జన జరిగిపోయే సమస్య ఉన్నవాళ్లకు కూడా ఈ వ్యాయామాలు ఉపయోగకరం.

ఇలా చేయాలి

ఈ వ్యాయామాలు చేసేటప్పుడు స్త్రీపురుషులు వేర్వేరు పద్ధతులు పాటించాలి.

- **సరైన కండరాలు:** మూత్రవిసర్జన చేయబోయి, ఆపుతున్నట్టు కండరాలను కదిలించడమే కెగెల్ ఎక్సర్‌సైజ్. మూత్రవిసర్జనతో సంబంధం ఉన్న కండరాలు బిగబట్టి, వదులు చేస్తూ ఉండాలి. అయితే సంబంధిత కండరాలేవో గ్రహించి, వాటిని మాత్రమే ఉపయోగించాలి. తర్వాత మూత్రవిసర్జన చేయడానికి వెళ్లినప్పుడు మూత్రవిసర్జనను మధ్యలో ఆపేయాలి. ఇలా చేస్తున్నప్పుడు ఏ కండరాలు మూత్రవిసర్జనను అదుపు చేస్తున్నాయో స్వయంగా గ్రహించగలుగుతారు. మహిళల్లో (యోని), మూత్రాశయం లోని కండరాలు బిగుసుకుని, పైకి లాగబడతాయి. ఈ కండరాలే మహిళలకు సంబంధించిన కటి కండరాలు. ఈ కండరాలే వ్యాయామం చేసే సమయంలోనూ బిగుసుకుంటూ ఉంటే వ్యాయామం సరిగా చేస్తున్నారని అర్థం. అలాగే తొడలు, పిరుదులు, పొత్తికడుపు కండరాలు ఈ వ్యాయామం చేసే సమయంలో విరామ స్థితిలో ఉండాలి.

వ్యాయామం ఇలా!

- మూత్రాశయం ఖాళీగా ఉంచాలి. పొట్టలో వాయువులు ఉండకూడదు.
- మీ సౌకర్యాన్ని బట్టి కూర్చుని లేదా పడుకుని వ్యాయామం చేయాలి.
- నెమ్మదిగా కటి కండరాలను బిగపట్టి, 10 అంకెలు లెక్కపెట్టి వదలాలి.
- వదిలిన తర్వాత మరో 12 అంకెలు లెక్కపెట్టి తిరిగి బిగపట్టాలి.
- వ్యాయామం చేస్తున్నంతసేపు, గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని, శరీరాన్ని విశ్రాంత స్థితిలో ఉంచాలి. పొట్ట, తొడలు, ఛాతీ కండరాలు బిగదీయకూడదు. పొత్తికడుపు కండరాలు విశ్రాంతంగా ఉంచాలి.

ఈ వ్యాయామాలను క్రమం తప్పకుండా 4 నుంచి 6 వారాలపాటు చేయాలి. క్రమక్రమంగా కటికి సంబంధించిన సమస్యలు దూరమవుతాయి. అయితే ఈ వ్యాయామాలను అవసరానికి మించి చేయడం వల్ల మల,మూత్రవిసర్జన సమయంలో కండరాల నొప్పులు మొదలవుతాయి.



గమనిక

- ఈ వ్యాయామాలను సరైన పద్ధతిలో చేయని మహిళలకు లైంగిక కలయిక సమయంలో ఇబ్బందులు తలెత్తవచ్చు.
- ఈ వ్యాయామాలను చేస్తూ, కొంతకాలం తర్వాత ఆపిన మహిళల్లో తిరిగి మూత్రం కారిపోయే సమస్య తలెత్తే వీలుంది. కాబట్టి ఎక్కువ కాలంపాటు ఈ వ్యాయామాలు చేయాలి.
- ఈ వ్యాయామాలు చేయడం మొదలుపెట్టిన చాలా కాలం తర్వాత మాత్రమే మూత్రం కారడం, మలవిసర్జన సమస్యలు అదుపులోకి వస్తాయి.

వైద్యులను కలవాలి

- ఈ వ్యాయామాలను సక్రమంగా చేస్తున్నారో, లేదో తెలుసుకోవడం కోసం వైద్యులను కలవడం అవసరమే! వైద్యుల సూచనల మేరకు వ్యాయామాల మీద పట్టు సాధించి సాధన చేయడం ద్వారా కటి సంబంధ కండరాల బలహీనతతో తలెత్తే ఇబ్బందులను అధిగమించవచ్చు.

హెల్త్ వెల్త్

నోటి దుర్వాసన ఎందుకు?



నోటి దుర్వాసన కేవలం నోటి శుభ్రతా లోపం వల్లనే కాదు! మరెన్నో అంతర్గత రుగ్మతల ప్రధాన లక్షణం కూడా! ఉదర కేన్సర్ కూడా నోటి దుర్వాసన ద్వారానే బయల్పడుతుంది. కాబట్టి మూల కారణాన్ని కనిపెట్టి, చికిత్స తీసుకోవాలి.

- **చిగుళ్ల వ్యాధి:** పెరియోడాంటైటిస్, జింజివైటిస్ అనే ప్రధానమైన చిగుళ్ల వ్యాధుల్లో నోటి నుంచి దుర్వాసన వెలువడుతుంది. ఈ సమస్యలు ఉన్నప్పుడు చిగుళ్లు వాచి, రక్తం, చీము కారుతూ ఉంటాయి. వ్యాధికారక బ్యాక్టీరియా చిగుళ్లలో తిష్ట వేయడమే ఇందుకు కారణం. ఈ లక్షణాలకు తోడు నోటి నుంచి భరించలేని దుర్వాసన వెలువడుతుంటే, చిగుళ్ల వ్యాధిగా భావించి దంత వైద్యులను సంప్రతించాలి.
- **ఎలర్జీలు:** గొంతులో దురద, ముక్కు దిబ్బెడ, కంటి నుంచి నీరు కారడం లాంటి ఎలర్జీలు ఉంటే వాటికి తోడు నోటి దుర్వాసన కూడా అనుభవంలోకి వస్తుంది. తెమడ చెడు సూక్ష్మక్రిములకు నెలవు. వాటి వల్ల నోటి దుర్వాసన మొదలవుతుంది. అలాగే ఎలర్జీలు ఉన్నప్పుడు నోరు ఎండిపోతూ ఉంటుంది. దీని ఫలితంగా కూడా నోటి నుంచి దుర్వాసన వెలువడుతుంది. ఈ దుర్వాసన వదలాలంటే తెమడ వదిలించుకుని, జలుబు, దగ్గులను మందులతో అదుపు చేసుకోవాలి.

పేరుకే జనరల్ ఆసుపత్రి.. దిక్కులేని కార్డియో విభాగం

కరీంనగర్, హైదరాబాద్‌కు పరుగులు తీస్తున్న బాధితులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 26: రెండు సంవత్సరాల క్రితం రామగుండం మెడికల్ కళాశాల ఏర్పాటు అయి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి 332పడకల ఆసుపత్రిగా మారింది. అయినప్పటికీ ఇక్కడ వైద్య సేవలు అంతంత మాత్రంగానే మారాయి. ఇక్కడ ఫిజిషియన్ వైద్యులు తప్ప గుండెకు సంబంధించిన వ్యాధి నిపుణులు లేకపోవడంతో వారానికి నాలుగు నుంచి ఆరుగురు గుండెపోటుతో మరణిస్తున్నారు. సింగరేణి కార్మికులతో పాటు 20 నుంచి 30ఏళ్లలోపు యువకులు ఎక్కువశాతం గుండె వ్యాధులకు గురవుతున్నారు. గుండెపోటు వచ్చిన వారికి సకాలంలో వైద్యం అందక మార్గమధ్యంలోనే మృత్యువాత పడుతున్నారు. అతిచిన్న వయసులో గుండెకు సంబంధించిన వ్యాధులు రావడం ఇక్కడి వాతావరణ కాలుష్యం అధికంగా ఉండడంతోనే మరణాలు సంభవిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇంత పెద్ద పారిశ్రామిక ప్రాంతలో 2డీ ఈకో యంత్రాలు కూడా సరిగా లేవు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యులు ఉండాల్సి ఉండగా ఇంకా కొన్నివిభాగాలు అందుబాటులోకి రాలేదు. ఇటీవలనే సిటీ స్కాన్ యంత్రం అందుబాటులోకి వచ్చినా ఇంకా గుండెకు సంబంధించిన పరికరాలు అందుబాటులో లేవు. ఆరు నెలల క్రితం ఫైవింక్లయిన్‌కు చెందిన శ్రీనివాస్ అనే యువకుడు గుండెపోటుకు గురై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వస్తే అక్కడ సరైన వైద్యం లభించక వీల్ ఛైర్‌లోనే మృత్యువాతపడడం పలువురిని కలిచివేసింది. శ్రీనివాస్ వయసు కూడా 30సంవత్సరాలే. ఇలా చాలామంది గుండెపోటుకు గురై మృత్యువాత పడడం పలు కుటుంబాలను శోకసముద్రంలో ముంచెత్తుతోంది. రాత్రి 10గంటలు దాటితే ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా వైద్యం లభించక చాలా మంది కరీంనగర్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళుతూ మార్గమధ్యంలోనే మృత్యువాత పడిన సందర్భాలు చాలా ఉన్నాయి. పారిశ్రామిక ప్రాంతంలో అత్యధికంగా ఈ రెండు మూడు సంవత్సరాల నుంచి గుండెపోటుకు గురై మృతి చెందుతున్నారు.

సింగరేణి ఆస్పత్రిలో సైతం..

గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన


గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

కార్డియాలజీ విభాగం ఉండాల్సి ఉండగా ఇప్పటి వరకు దాని ఊసే లేదు. ప్రతీ జనరల్ ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగంలో గుండెకు సంబంధించిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జూనియర్ డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఇక్కడ ఆ విభాగమే లేదు. రామగుండంలో ఎక్కువ మంది గుండెపోటు, పక్షవాతం వ్యాధులకు గురయ్యే బాధితులే ఎక్కువ మంది ఉంటారు. గుండెకు సంబంధించిన వైద్య విభాగం కానీ, నరాలకు సంబంధించిన న్యూరో విభాగాన్ని కానీ ఏర్పాటు చేయలేదు. గుండె వ్యాధి గ్రస్థుల కోసం ఐసీయూ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కనీసం పది పడకల ఐసీయూ కూడా లేదు. సింగరేణి ఆసుపత్రిలో కూడా గుండె డాక్టర్లు లేకపోవడం వల్ల చాలా మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు హైదరాబాద్ వంటి నగరాలకు వెళుతున్నారు. చాలా మందిని కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. రామగుండం మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఖని జనరల్ ఆసుపత్రి, సింగరేణి ఏరియా ఆసుపత్రుల్లో వైద్యం అందించాల్సి ఉండగా ఇందులో స్పెషలిస్టు డాక్టర్లు లేకపోవడంతో చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి గుండెపోటు బాధితులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు.

కార్డియాలజీ విభాగాన్ని ఏర్పాటు చేయండి

కే కనకరాజు, సీపీఐ నగర కార్యదర్శి



రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇప్పటికీ వైద్య సేవలు కలగానే మారాయి. మెడికల్ కళాశాల వచ్చినప్పటి కీ కనీసం గుండె డాక్టర్లు లేకపోవడం ఇక్కడి ప్రాంత వాసులకు శాపంగా మారింది. ఇక్కడ రోజుకో గుండెపోటు మరణం ఉండడం బాధాకరం. ఎవరికైన గుండెనొప్పి వస్తే కరీంనగర్‌కు పరుగులు తీయాల్సి వస్తుంది. కొంత మంది నాయకుల వల్ల కూడా ఇక్కడ ప్రైవేట్ ఆసుపత్రులు నెలకొల్పాలంటే జంకుతున్నారు. రామగుండం మెడికల్ కళాశాలకు అనుబంధంగా మరిన్ని ప్రైవేట్ ఆసుప త్రులు వస్తే ఇక్కడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం లభించి కొంత మేరకైనా ప్రాణాలను కాపాడుకోవచ్చు.

గుండె వ్యాధి నిపుణులను ఏర్పాటు చేస్తాం..



మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే

సింగరేణి నిధులతో ఏర్పాటు అయిన రామగుండం మెడికల్ కళాశాలను మరింత విస్తరించి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గుండె వ్యాధి నిపుణుల విభాగాన్ని ఏర్పాటు చేస్తాం. నాలుగు రోజుల క్రితమే గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 16.2కోట్లతో క్రిటికల్ కేర్ విభాగానికి శంకుస్థాపన జరిగింది. ఇక్కడి ప్రజల ప్రాణాలను కాపాడటానికి మరిన్ని వైద్య సేవలను అందుబాటులోకి తీసువస్తాము. గుండెకు సంబంధించిన వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండే విధంగా త్వరలోనే ఏర్పాటు చేస్తాం. రామగుండాన్ని మెడికల్ హబ్‌గా మార్చి ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తాము. మరో 200పడకల ఆసుపత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించాను.

రైతులపై బీజేపీ ప్రభుత్వం కాల్పులు జరపడం దుర్మార్గం

- సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

పెద్దపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర కల్పించాలని, సమస్యలకు పరిష్కరించాలని ఢిల్లీలో శాంతి యుతంగా నిరసన చేస్తున్న రైతులపై బీజేపీ ప్రభుత్వం కాల్పులు జరపడాన్ని ఖండిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం రైతులే ఎదుర్కొంటున్న సమస్యలపై ఎలాంటి చిత్తశుద్ధి కనపరచడం లేదని దేశవ్యాప్తంగా రైతులకు సంబంధించి న ప్రతి ముడి సరుకుల పైన ధరలు ఆకాశాన్ని అంటా యన్నారు. జీఎస్టీల రూపంలో కేంద్రం మరింత బరువు మోపుతుందని ఆరోపించారు. ఈ సమస్యలన్నింటికీ గిట్టుబాటు ధర కల్పిస్తేనే పరిష్కారం దొరుకుతుందని సదానందం అన్నారు.

అంతేకాకుండా రైతులు ఎదుర్కొంటున్న అనేక న్యాయమైన సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ కార్యదర్శి కామ్రేడ్ గౌతం గోవర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కే కనకరాజు, నాయకులు పెరుక సతీష్, మార్కపురి సూర్య ఆసాల నవీన్, కల్లేపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ టవర్ ఎక్కి యువకుడి హంగామా

పోలీసుల హామీతో టవర్ దిగిన యువకుడు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 26: మండలంలోని మల్యాల గ్రామ పరిధిలోని జగ్గయ్యపల్లెకు చెందిన లోనే రాజు అనే యువకుడు సోమవారం హై టెన్షన్ టవర్ ఎక్కి హంగామా సృష్టించాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి సమస్య పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో రాజు హై టెన్షన్ టవర్ దిగి వచ్చాడు. రోజు గతంలో తన కుటుంబ సభ్యులకు భూమిని తక్కువ ధరకు అమ్మానని, ఇప్పుడు నా భూమి నాకు కావాలంటూ హైటెన్షన్ టవర్ ఎక్కి మూడు గంటల పాటు హంగామా సృష్టించాడు. సంఘటన స్థలానికి పోలీసులు, గ్రామస్థులు యువకుడికి నచ్చజెప్పారు..

ఆలయ హుండీ అపహరించిన నిందితుల అరెస్ట్

ధర్మారం, ఫిబ్రవరి 26: మండలంలోని దొంగ తుర్తి గ్రామంలోగల వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ అపహరించిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ తెలిపారు. సోమవారం ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుండీ అపహరించిన కేసులో నిందితుల వివరాలను ఆయన వివరించారు. దొంగతుర్తి గ్రామంలోని గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓదెల మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మానుపాటి రాజు, మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలోని పొంబూర్ణ గ్రామానికి చెందిన ఉమేష్ కలిసి గుడి తాళాలు పగులగొట్టారు. ఉమేష్ గుడి ముందు ఉండి వ్యక్తుల రాకలను గమనిస్తుండగా రాజు గుడి తాళాలను పగులగొట్టాడు. అందులో ఉన్న రెండు హుండీలను ఓ ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి తాళాలను పగులగొట్టడానికి ప్రయత్నించగా తాళాలు పగలకపోవడంతో సమీపంలోని చెట్ల పొదల్లో పడేశారు. ఆలయంలో దొంగలు పడి రెండు హుండీలను అపహరించారని పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఈ కేసును ఛేదించడానికి క్లూస్ టీం బృందం వేలిముద్రలను సేకరించారు. దీని


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జి కృష్ణ

ఆధారంగా రాజు, ఉమేష్ నేరానికి పాల్పడినట్టు తేలింది. సోమవారం దొంగతుర్తి శివారులో చెట్ల పొదల్లో పడేసిన రెండు హుండీలను ఓ ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పెద్దపల్లి సీఐ ఆర్ కృష్ణ, ఎస్సై సత్యనారాయణతో పాటు పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు హుండీలను స్వాధీనం చేసుకుని లెక్కించగా 20వేల 63రూపాయలు ఉన్నాయి.

రాజు, ఉమేష్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ట్టు ఏసీపీ జి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ, కానిస్టేబుల్‌లు రాజు, ప్రభాకర్, సతీష్, తిరుపతిలను ఆయన అభినందించారు. విలేకరుల సమావేశంలో పెద్దపల్లి సీఐ ఆర్ కృష్ణ, ఎస్సై సత్యనారాయణ ఉన్నారు.

ధర్మం గెలవాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శంకర్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 26: ధర్మం గెలవాలంటే ఎస్సీ వర్గీకరణ జరుగాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శంకర్ అన్నారు. సోమవారం గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన పాలకులు ఎస్సీల మధ్య అంతర్గతంగా పెరిగిన అసమానాతలను తొలగించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రిజర్వేషన్లను దోచుకునే వర్గాలకు వత్తాసు పలుకుతున్నారని, ఎస్సీలలో వెనుకబడిన కులాలవైపు కన్నెత్తి చూడడం లేదన్నారు.

మంద కృష్ణమాదిగ దండోర ఉద్యమం స్థాపించిన తరువాత మాదిగ ఉప కులాల ప్రజలకు జరిగిన అన్యాయం వెలుగులోకి వచ్చిందన్నారు. కొంతమంది స్వార్థపరులు సుప్రీం కోర్టుకు వెళ్లి రిజర్వేషన్ల వర్గీకరణను రద్దు చేయించారన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు పోరాటం ఆగదన్నారు. మార్చి 5న గోదావరిఖని కేంద్రంలో పెద్దపల్లి పార్లమెంట్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరుగుతుందని, దీన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మంథని చందు, పొట్ల రమేష్, దశరథం, పల్లె బాపు, దాసరి కిషన్, శ్రీనివాస్, రాజయ్య, మాతంగి కుమార్, శివకుమార్, రాము, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతర హుండీ ఆదాయం రూ.29.44లక్షలు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 26: గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ జాతర హుండీల లెక్కింపు సోమవారం జరిగింది. రూ.29,44,489ఆదాయం వచ్చినట్టు ఈవో కాంతారెడ్డి పేర్కొన్నారు. 12 గ్రాముల బంగారం, 1.8కిలోల వెండి వచ్చింది. వీటితో పాటు 23అమెరికా డాలర్లు భక్తులు హుండీలో వేశారు. గత జాతరలో రూ.30.13లక్షల ఆదాయం హుండీ ద్వారా రాగా ఈ జాతరలో రూ.69వేలు తగ్గింది. మొత్తంగా జాతర ఆదాయం మాత్రం రూ.99వేలు పెరిగింది. వేలం ద్వారా రూ.13.84 లక్షలు, ప్రత్యేక దర్శనాలు, కేశకండన ద్వారా రూ.5.37లక్షల ఆదాయం వచ్చింది. ఈ- స్కానర్ ద్వారా వచ్చిన ఈ-హుండీ లెక్కించాల్సి ఉంది.



హుండీలో వచ్చిన ఆదాయాన్ని లెక్కిస్తున్న వలంటీర్లు, అమెరికన్ డాలర్లు

● పెరిగిన భక్తులు.. తగ్గిన ఆదాయం..

గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ జాతరకు ఈ సారి భక్తుల తాకిడి పెరిగింది. ఐదు లక్షలకుపైగా భక్తులు హాజరయ్యారని అంచనా వేస్తున్నారు. కాగా హుండీ ఆదాయం మాత్రం మేడారం ప్రభావం పడింది. ఈసారి కోల్‌బెల్ట్ నుంచి మూడు నెలల ముందుగానే పెద్ద సంఖ్యలో కుటుంబాలు మేడారం దర్శనానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. మళ్లీ జాతర సమయంలో గోదావరిఖని జాతరలో దర్శనాలు చేసుకున్నారు. మొక్కులు మేడారంలో పెట్టడంతో హుండీ ఆదాయం తగ్గినట్టు జాతర కమిటీ అంచనా వేస్తుంది. లెక్కింపు కార్యక్రమంలో ఈవో కాంతారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుజాత, జాతర కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.



ఈపీ గ్రీజర్ పోస్టుల భర్తీకి పరీక్ష


అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 26: ఓసీపీ-3లో ఖాళీగా ఉన్న ఈపీ గ్రీజర్ హెల్పర్ పోస్టుల భర్తీ కోసం సోమవారం ఆర్జీ-2 యాజమాన్యం అర్హత గల ఉద్యోగులకు పరీక్ష నిర్వహించింది. హెచ్‌ఈఎంఎం మజ్దూర్‌గా పనిచేస్తూ ఐదేళ్ళ అనుభవం కల్గిన 32 మంది బేస్‌వర్క్‌షాప్‌లో జరిగిన పరీక్షకు హాజరయ్యారు. 22 పోస్టులకు గాను యాజమాన్యం పరీక్ష నిర్వహించింది. పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులుగా ఏరియా ఇంజనీర్ నరసింహారావు, పీఈ రాజాజీ, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, డీవైఎస్ఈ శ్రీధర్, డీవైపీఎం శ్రీధర్ వ్యవహరించారు.

ఓసీపీ-3లో రక్షణ చర్యలు పరిశీలన

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 26: ఓసీపీ-3లో రక్షణ చర్యలను సేఫ్టీ కమిటీతో కలిసి ఏఐటీయూసీ బృందం సోమవారం పరిశీలించింది. క్వారీతో పాటు సీహెచ్‌పీలో రక్షణ చర్యలను పరిశీలించి కార్మికుల నుండి వివరాలు తెలుసుకున్నారు. విపరీతమైన దుమ్ముతో పనిచేయలేని స్థితి ఉన్నట్టు నాయకులు పేర్కొన్నారు. సీహెచ్‌పీ బంకర్ వద్ద పనిచేస్తున్న కార్మికులకు రక్షణ లేదని, డంపర్లు బొగ్గును డంప్ చేసే స్థలం ఎగుడు దిగుడుగా ఉన్నదని నాయకులు పేర్కొన్నారు. 100 టన్నుల డంపర్ పార్కింగ్ యార్డులో సరైన లైటింగ్, పార్కింగ్ విధానం లేదని తెలిపారు. ఫేస్-2 సీహెచ్‌పీలో గ్యాస్ కారణంగా కార్మికులు ఇబ్బందులు పడుతున్నట్టు పేర్కొన్నారు. ప్రాజెక్టులో ఇటీవల 10మంది కార్మికులు దుమ్ము కారణంగా నిమోనియా బారినపడిన యాజమాన్యం స్పందిచకపోవడం బాధాకరమైన విషయమని ఏఐటీయూసీ నాయకులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రాజెక్టును పరిశీలించిన బృందంలో ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్, సెక్రెటరీలు ఎల్ ప్రకాష్, రాజారత్నం, బ్రాంచి సెక్రెటరీ ఈ రవీందర్, పిట్ సెక్రెటరీ ఇజ్జ రాజయ్య, పిట్ సేఫ్టీ కమిటీ సభ్యులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య మోటివేషనల్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా సోమవారం అర్హత పత్రాన్ని అందుకున్నారు.

కాల్వశ్రీరాంపూర్: జీఓ 317 సమస్యలపై రాష్ట్ర మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేయడం హర్షణీయమని 317 జీఓ బాధిత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు కూరపాటి సత్యప్రకాష్‌రావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

- కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన పెండోట సతీష్‌చారి ఇటీవల మృతి చెందగా అతని కుటుంబానికి కాల్వ శ్రీరాంపూర్ కేడీసీసీ బ్యాంకు ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును బ్యాంకు మేనేజర్ కరుణ శ్రీ సతీష్‌చారి భార్య జ్యోతిశ్రీకి అందజేశారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ ముత్యం సునిత భర్త ఇటీవల మృతి చెందగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తదితరులు వారి కుటుంబస భ్యులను సోమవారం పరామర్శించారు.

సుల్తానాబాద్: మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన బొంకూరి నరేష్ (25) అనే యువకుడు చికిత్స పొందుతు సోమవారం మృతి చెందారు. కడుపు నొప్పి భాదను భరించలేక నరేష్ ఈ నెల 10న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజేందర్ తెలిపారు.

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతి పరిదీ కృష్ణానగర్, వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్న కుక్కల బెడద నివారణకు అధికారులు సోమవారం చర్య లు చేపట్టారు. సుమారు 50 కుక్కలను కేజ్ ఆటోలో బంధించి ఇతర ప్రాంతాలకు తరలింపు చేపట్టారు.

రామగిరి: జిల్లా పంచాయితిరాజ్‌శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించి సోమవారం తొలిసారి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన శంకర్‌ను ఎంపీపీ ఆరెల్లిదేవక్క శాలువతో ఘనంగా సత్కరించారు.

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్‌లో పెద్దమ్మతల్లి విగ్రహా ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం నిత్య పూజ, అభిషేకం నిర్వహించారు. జడ్పీటీసి కందుల సంధ్యారాణీ, బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్‌హరి, ఆలయ ఫౌండేషన్ సభ్యుడు పరికిపండ్ల రాము, మాజీ సర్పంచ్ రావుల శారద పున్నంసాగర్ తదితరులు పాల్గొన్నారు.

భయం వీడి ప్రణాళికాబద్ధంగా చదవాలి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 26: పరీక్షల పట్ల భయాన్ని వీడి ప్రణాళికా బద్ధంగా, ఒత్తిడి లేకుండా చదివితే ఉత్తమ ఫలితాలతో విజయం సాధ్యమవుతుందని కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ రామగుండం పీఎస్‌టీల ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖని మార్కండేయకాలనీలోని రెయిన్ బో పాఠశాలలో పదవతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రేరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షలంటే భయం వీడితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అమరేందర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి గోపాల్‌రావు పాల్గొన్నారు.

ప్యాక్స్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

ఓదెల, ఫిబ్రవరి 26: పొత్కపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం సోమవారం నెగ్గింది. పది మంది డైరెక్టర్లు చైర్మన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టారు. ఈ మేరకు పొత్కపల్లి సింగిల్ విండో కార్యాలయంలో డీసీవో శ్రీమాల అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి పదిమంది అసమ్మతివాదులు హాజరై మెజారిటీని నిరూపించుకోవడంతో, అవిశ్వాసం నెగ్గినట్లు అధికారి ప్రకటించారు. తిరిగి మంగళవారం ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎన్నిక, అలాగే 12 గంటలకు వైస్ చైర్మన్ ఎన్నిక, ఉంటుందని అధికారులు తెలిపారు.

వైభవంగా దేవునిపల్లి నంబులాద్రి స్వామి రథోత్సవం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 26: మండలం లోని దేవునిపల్లి లక్ష్మీనంబులాద్రి స్వామి వారి రథోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. పెద్దపల్లితో పాటు పలు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఈ రథోత్సవంలో పాల్గొన్నారు. రథం పై ఉన్న స్వామి వారిని దర్శనం చేసుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయంలోని మూల మూర్తుల దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, జడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాష్‌రావు, కేడీసీసీబీ డైరక్టర్లు దేవరనేని మోహన్‌రావు, శ్రీగిరిశ్రీనివాస్, తదితరులు రథం పై ఉన్న స్వామి వారిని, ఆలయంలోని మూల మూర్తులను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు,ఉత్సవాల నిర్వాహకులు ఆయనను సత్కరించి అశీర్వచనాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కూడా దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అట్ల కుమార్ యాదవ్, డైరక్టర్లు, ఎంపీపీ బాలాజీరావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చుతాం


సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, ఫిబ్రవరి26: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామంలో సోమవారం ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.12లక్షలు వెచ్చించి అంతర్గత సిమెంట్ రోడ్లకు ఆయన మండల ప్రజాప్రతినిధులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంట్‌రోడ్లు నిర్మిస్తామని ఆయన చెప్పారు కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ మండిగ రేణుక, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, నాయకుడు పెద్దపల్లి దేవరాజు, బూర్ల వెంకటసత్యం, కొండ తిరుపతిగౌడ్, పొట్యాల రమేష్, రామస్వామి, నరేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'మంథని అభివృద్ధికి శ్రీపాదరావు కృషి'

ముత్తారం, ఫిబ్రవరి 26: మంథని అభివృద్ధికి దుద్దిళ్ల శ్రీపాదరావు కృషి చేశారని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, మండల పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ అన్నారు. దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంపై ముత్తారం మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ శ్రీపాదరావు మంథని నియోజకవర్గంలో విద్యకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అలాంటి వ్యక్తిని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి అధికారికంగా జయంతి వేడుకలు జరపడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎన్ఆర్ఈజీఎస్ నుంచి 6 కోట్ల విలువ చేసే సీసీ రోడ్లను మండలానికి మంజూరు చేయించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సింగిల్‌విండో ఛైర్మన్ అల్లాడి యాదగిరిరావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మంథని, ఫిబ్రవరి 26: మున్సిపాలిటీలో పరిధిలోని 314 సర్వే నంబర్ కుర్ర లింగయ్య అనే మున్సిపల్ కౌన్సిలర్ 23 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు జల్లారం మాజీ సర్పంచ్ జగన్నాదు హరీష్ సోమవారం తెలిపారు. ఈవిషయంలో తాను అనేక సార్లు మంథని మున్సిపల్ కమీషనర్‌తో పాటు రెవెన్యూ అధికారులకు, ఈనెల 19న ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 21-02-2024 రోజున మంథని మున్సిపల్ కమీషనర్ 16 సర్వే నంబర్ వేసి ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఇచ్చారన్నారు. అప్పటికే సర్వే నెం.314లో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతుండగా కమీషనర్ ఇచ్చిన తప్పుడు అనుమతితో ఇంటి నిర్మాణాన్ని వేగవంతం చేయడం జరిగిందన్నారు. తప్పుడు సర్వే నంబర్‌తో ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఇచ్చిన మున్సిపల్ కమిషనర్‌పై, ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా ఉదాసీనంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు చేపట్టి అక్రమ కట్టడాన్ని నిలువరించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

'ప్రజలకు సేవ చేయడానికే ట్రస్ట్'

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 26: ప్రజలకు సేవ చేయడానికే ప్రజా పాఠశాల విద్యా ట్రస్టును ఏర్పాటు చేసుకున్నామని ట్రస్ట్ ఛైర్మన్ చలపతిరావు, మేనేజింగ్ ఛైర్మన్ బిక్షమయ్య అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాపాఠశాల ఎడ్యుకేషన్ సొసైటీ, ట్రస్ట్ సంస్థలు కలిసి ప్రజా పాఠశాల విద్యా ట్రస్ట్‌గా ఏర్పాటు చేసుకున్నామన్నారు. అందరం ఐక్యంగా కూర్చొని సమస్యలను పరిష్కరించుకోవడం జరిగిందని, స్థిరాస్థులు బదిలీ చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రజాపాఠశాలలో 1వ తరగతి నుంచి 2వ తరగతి వరకు డిజిటల్ క్లాసులను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉన్నత ప్రమాణాలతో సుశిక్షితులైన అను భవం కలిసిన ఉపాధ్యాయులతో, తక్కువ ఫీజులతో విద్యను అందిస్తామన్నారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు కోడిపుంజుల రాజయ్య, ఎన్ రామయ్య, యాకయ్య, నరేష్, రవికిరణ్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, క్రాంతికిరణ్, లక్ష్మణమూర్తి, రాములు, అరుణ్ కేతన్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని అధికారులపై చర్య తీసుకోవాలి


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 26: నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగం ఇచ్చి ప్రమోషన్ కల్పించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు ఆయన వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆర్ల సందీప్ మాట్లాడుతూ కాల్వశ్రీరాంపూర్‌లో పనిచేస్తున్న వార్డెన్ సత్యనారాయణకు సదరం సర్టిఫికెట్ నందు 41 శాతం అనర్హుడు అని ఉన్నప్పటికీ ప్రమోషన్ కల్పించిన కరీంనగర్ డిడి నతానియల్, రిటైర్డ్ డీడీ బాల సురేందర్, సూపరింటెండెంట్ సబితపై చర్యలు తీసుకోవాలన్నారు. సదరు ఉద్యోగి కాల్వశ్రీరాంపూర్ వార్డెన్ సత్యనారా యణను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్దంగా అలవెన్స్ తీసుకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న అధికారు లను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్, రాంచరణ్ పాల్గొన్నారు.

అబాకస్ పోటీలకు 'జూపిటర్' విద్యార్థుల ఎంపిక

జూలపల్లి, ఫిబ్రవరి26: మండల కేంద్రంలోని జూపిటర్ ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు హైదరాబాద్‌లో నిర్వహించిన అబాకస్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీలకు ఆయా జిల్లాల్లోని వివిధ పాఠశాలల విద్యార్థులు 385మంది పాల్గొన్నారు. జూలపల్లి మండల కేంద్రంలోని జూపిటర్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు పాల్గొనగా సీనియర్ లెవల్ 2వ భాగంలో బి. శ్రీశాంత్ 5వ తరగతి విద్యార్థి చాంపియన్‌గా నిలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు.

స్టార్ జూనియర్స్ లెవల్ 3వ విభాగంలో 2వ తరగతి విద్యార్థిని వి.శ్రీనిజ 2వ స్థానంలో నిలిచింది. చాంపియన్‌గా నిలిచిన విద్యార్థులకు వచ్చే మార్చినెలలో పూనేలో జరిగే జాతీయ స్థాయి అబాకస్ పోటీలలో పాల్గొంటారని సీఈవో రవిచరన్ తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్‌రావు, పాఠశాల కరస్పాండెంట్ అందె కుమారస్వామి పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు బంగారు పతకాలు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 26: సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభను చాటి బంగారు పతకాలు సాధించారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్న హర్షవర్ధన్, సృజన్, విశ్వాస్‌లు పతకాలు సాధించారు. వారిని సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ మాటేటి సంజీవ్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియలు అభినందించారు.